నియోజకవర్గ ముఖచిత్రం
గుంటూరు వెస్ట్



శంకర్ విలాస్ పై ఓవర్ బ్రిడ్జి

విద్యల నిలయం..
జిల్లాకే తలమానికం

గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గం జిల్లా పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లా ఆవిర్భావం మొదలు, కొత్త జిల్లాల ఏర్పాటుతో మిగిలిన జిల్లాలో ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ ఇక్కడే కేంద్రీకృతమై ఉంది. బ్రిటిషు కాలంలో నిర్మించిన జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయ భవనాలు చెక్కుచెదరని దర్పంతో నియోజకవర్గానికి తలమానికంగా ఉన్నాయి. విద్యల ఖిల్లాగా గుంటూరు జిల్లా ప్రసిద్ధి చెందింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలలు, ఐఐటీ–జేఈఈ, నీట్, సీఏ శిక్షణలో రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన విద్యాసంస్థలు ఇక్కడే ఉన్నాయి. ప్రభుత్వ శాఖలతో పాటు పోటీ పరీక్షల శిక్షణకు ప్రసిద్ధి చెందిన కోచింగ్ సెంటర్లు పశ్చిమ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా శిక్షణార్థులు ఇక్కడికే వస్తుంటారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం సైతం ఇక్కడే ఉన్నాయి. పశ్చిమ నియోజవర్గం విద్యావంతుల నిలయంతో పాటు రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైన ప్రాంతం. ఎంతో మంది రాజకీయ ఉద్దండులు శాసనసభ, లోక్‌సభ, రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో పేరుగాంచిన రాజకీయ నేతలు ఉన్నారు. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మిర్చి యార్డు, పొగాకు బోర్డుతో పాటు కేంద్ర కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్, రాష్ట్ర మార్కెటింగ్, వ్యవసాయ, ఉద్యాన శాఖ కార్యాలయాలు, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ విద్యాలయాల సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలోనే అత్యధిక క్లాస్‌లుక్, సిటీలుక్ ఉన్న ప్రాంతం కావడంతో పాటు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు పుష్కలంగా జరుగుతున్నాయి.

జిల్లా పరిపాలనకు కేంద్రం

జిల్లా కలెక్టరేట్, జిల్లా ఎస్పీ, ఐజీ కార్యాలయంతో పాటు జిల్లా ప్రజా పరిషత్, జిల్లా న్యాయస్థానం, సీఐడీ, జిల్లా జైలు, ఆర్డీవో కార్యాలయం, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. డీఈఓ, పాఠశాల విద్య ఆర్జేడీ, డీఎంహెచ్ఓ, అగ్నిమాపక శాఖ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, గ్రామీణాభివృద్ధి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, గృహనిర్మాణ, వ్యవసాయం 33 ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యాలయాలు ఉన్నాయి.



ల్యాండ్ మార్క్స్

పశ్చిమలో పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే ప్రాంతాలతో పాటు ల్యాండ్ మార్క్స్‌గా ముద్రపడిన పేర్లు ఉన్నాయి. శంకర్‌విలాస్ సెంటర్ నగరానికి సరిగ్గా మధ్యలో ఉంటుంది. ఇక్కడి శంకర్‌విలాస్ హోటల్, పురాతన చరిత్ర కలిగిన ఆనందభవన్, గీతా రీజెన్సీ పేర్లు తెలియని వారు ఉండరు. లాడ్జి సెంటర్, లక్ష్మీపురం మదర్ థెరీస్సా విగ్రహ కూడలి, ఎన్టీఆర్ స్టేడియం, గుజ్జనగుండ్ల సర్కిల్, కలెక్టరేట్, అరండల్‌పేట ఆర్వోబీ, కంకరగుంట ఆర్వోబీ, జేకేసీ కళాశాల రోడ్డు, గుజ్జనగుండ్ల, కొరిటెపాడు సెంటర్, అమరావతిరోడ్డు ఉన్నాయి. స్వాతంత్య్ర సమరయోధుడు ఉన్నవ లక్ష్మీనారాయణ బ్రాడీపేటలో స్థాపించిన శ్రీశారదానికేతన్ మహిళా విద్యాసంస్థలు వందేళ్ల చరిత్రను సొంతం చేసుకున్నాయి.

- ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల్లో సుమారు 10 వేల మంది ఉద్యోగులతో పాటు నగరపాలక సంస్థ, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మూడు వేల మంది ఉపాధ్యాయులు, వ్యాపార సంస్థలు, గృహ నిర్మాణ, అసంఘటిత రంగాల్లో 20 వేల మంది కార్మికులు ఉన్నారు.
- నగరపాలక సంస్థ యాజమాన్యంలో ఐదు హైస్కూళ్లతో పాటు 30 ప్రాథమిక, 20 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు 100 వరకూ ఉన్నాయి. ఐదు ఎయిడెడ్ కళాశాలలు, 40 ప్రైవేటు జూనియర్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.
- వైద్య రంగంలో రాష్ట్రస్థాయిలోనే గుర్తింపు పొందిన గుంటూరు మెడికల్ కళాశాల నియోజకవర్గంలోనే ఉంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన జింకానా ఆడిటోరియం కళాశాలకే హైలెట్. 20 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి.

ఆధ్యాత్మికంగా ఉన్నతం

బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, మారుతీనగర్‌లోని మారుతి దేవాలయం, అరండల్‌పేటలోని అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణ స్వామి ఆలయం, సంపత్‌నగర్‌లోని శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానం, ఆర్.అగ్రహారంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, సిద్ధార్థ నగర్‌లోని కనక మహాలక్ష్మి దేవస్థానం ప్రముఖమైనవి. వీటితో బ్రాడీపేటలోని నార్త్ ప్యారిష్ చర్చి, ఏసీ కళాశాల ఎదుట ఉన్న పునీత ఆగ్నేసమ్మ చర్చి, మార్కెట్ రోడ్డులోని వెస్ట ప్యారిష్ చర్చి ప్రముఖమైనవి. జీటీ రోడ్డులోని మస్తాన్ వలీషా దర్గా, పట్టాభిపురం, బ్రాడీపేటలోని రెండు మసీదులు ప్రసిద్ధి చెందాయి.

ఎమ్మెల్యేలుగా గెలిచినవారు

1. మేడూరి నాగేశ్వరరావు (కాంగ్రెస్-1955)
2. చేబ్రోలు హనుమయ్య (కాంగ్రెస్-1962, 1967)
3. నిశ్శంకరావు వెంకటరత్నం (ఇండిపెండెంట్-1972)
4. గాదె వీరాంజనేయశర్మ (కాంగ్రెస్-1978)
5. నిశ్శంకరావు వెంకటరత్నం (టీడీపీ -1983)
6. చదలవాడ జయ రాంబాబు (కాంగ్రెస్-1985, 1989)
7. చల్లా వెంకటకృష్ణారెడ్డి (టీడీపీ-1994)
8. శనక్కాయల అరుణ (టీడీపీ-1999)
9. తాడిశెట్టి వెంకట్రావు (కాంగ్రెస్-2004)
10. కన్నా లక్ష్మీనారాయణ (కాంగ్రెస్-2009)
11. మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి (టీడీపీ-2014)
12. మద్దాళి గిరిధర్‌రావు (టీడీపీ-2019)


గుంటూరు మిర్చి యార్డు

జిల్లా ప్రముఖులు

రాజకీయరంగంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి చిలకలూరిపేట ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని, సత్తెనపల్లి ఎమ్మెల్యే–రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు ఇక్కడే నివశిస్తున్నారు. మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ, టీడీపీకి చెందిన వ్యాపారవేత్త చుక్కపల్లి రమేష్, టీడీపీ నాయకురాలు నన్నపనేని రాజకుమారి, పారిశ్రామికవేత్త, బీజేపీ నాయకుడు తులసి రామచంద్రప్రభు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, క్రీడా రంగంలో అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, పారిశ్రామికవేత్తలు బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, చేబ్రోలు హనుమయ్య కుటుంబాలు ఉన్నాయి.



- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ విస్తీర్ణం 23.49 చదరపు కిలోమీటర్లు
- గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న పశ్చిమ నియోజకవర్గంలో 25 డివిజన్లు పూర్తిగానూ, 7 డివిజన్లలో కొంతభాగం ఉంది.
- జనాభా 4.30 లక్షలు

ఓటర్ల సంఖ్య: 2,78,158
- పురుషులు: 1,35,426,
మహిళలు: 1,42,685,
థర్డ్ జెండర్: 44,
ఓవర్‌సీస్ ఎలక్టోర్స్: 435 ,సర్వీస్ ఓటర్లు: 156

క్లుప్తంగా

పశ్చిమలో హోమ్ ఓటింగ్ ప్రారంభం

నెహ్రూ నగర్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 347 హోమ్ ఓట్లకు గాను 210 ఓట్లు పోలయ్యాయని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం నగరంలోని నవభారత్ నగర్‌లోని 3/1లో హోం ఓటింగ్‌ని పశ్చిమలో పోటీలో ఉన్న అభ్యర్థుల ఎలక్షన్ ఏజెంట్ల సమక్షంలో అదనపు కమిషనర్, ఆర్ఓ హోమ్ ఓటింగ్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం హోం ఓటింగ్‌కి అమలు చేస్తున్న మార్గదర్శకాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 347 మందిని అర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు. శుక్రవారం నిర్వహించిన హోం ఓటింగ్ లో 347 మంది ఓటర్లకు గాను 210 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

నగరంపాలెం: ఈనెల 13వ తేదీన ఓటర్లు అందరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్ కోరారు. ఎస్ఈబీ (సెబ్) గుంటూరు–1 స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ఓటర్ల అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఆర్ఎం మాట్లాడుతూ మద్యం, ఉచితాలు, డబ్బుకు ఓటు హక్కును విక్రయించవద్దని అన్నారు. పిల్లల భవిష్యత్ ఆలోచించి, మంచి పరిపాలన అందించే వారికి ఓటు వేయాలని చెప్పారు. సెబ్ గుంటూరు–1 స్టేషన్ సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఎవరైనా మద్యాన్ని పంపిణీ చేసిన, నిల్వ చేసి రవాణా చేసిన వారి సమాచారం అందించాలని అన్నారు. ఎస్ఐ టి.తులసి పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై సమావేశం

లక్ష్మీపురం: పత్రికలు, మీడియా నిష్పక్షపాతంగా పని చేసే విధంగా ప్రోత్సహించాలని ఉపాధ్యాయ, ఉద్యమ నాయకులు ఎ.వి.రామారావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించారు. పౌర హక్కుల నాయకులు ఎల్.మురళీకృష్ణ మాట్లాడారు.

అవోపా ఆధ్వర్యంలో గో సేవ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరువారితోటలోని రాధాకృష్ణ గోశాలలో శుక్రవారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో గో సేవ, గో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రావు పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమలో విజయం తథ్యం

- జగనన్న గెలుపు కోసం ప్రజల ఎదురుచూపులు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- 23, 24 డివిజన్లలో మనతో మన రజినమ్మ ఎన్నికల ప్రచారం
- ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్


మంత్రి రజిని, ఎమ్మెల్యే గిరిధర్‌లకు హారతి ఇస్తున్న మహిళలు

పట్నంబజారు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వార్ వన్‌సైడ్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అసెంబ్లీ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 24, 23 డివిజన్‌లలో శుక్రవారం మనతో మన రజినమ్మ ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో గెలిచేది వైఎస్సార్ సీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. భారీ మెజారిటీతో విజయం తథ్యం అని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే రేపటి తమ గెలుపునకు కారణమని పేర్కొన్నారు. తమకు మేలు జరగాలంటే జగనన్నకు ఓటేయాలనే నిర్ణయానికి రాష్ట్ర ప్రజలంతా వచ్చేశారని తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు తన హయాంలో చేసిందేమీ చెప్పుకోవడానికి లేక, చివరకు జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలు అన్నీ తాను కూడా ఇస్తానని, అంతకంటే ఎక్కువ ఇస్తానని చెబుతున్నారని ధ్వజమెత్తారు. వలంటీర్లను కంటిన్యూ చేస్తానని చెబుతుండటం సిగ్గుచేటని విమర్శించారు. జగనన్న గెలుపు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు.

ఐదేళ్ల పాలన ఒక విప్లవం

జగనన్న కేవలం ఐదేళ్ల కాలంలో ఎన్నో విప్లవాత్మక పథకాలు అమలు చేశారని పశ్చిమ నియోజకవర్గ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ తెలిపారు. సంక్షేమంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. 24వ డివిజన్‌లో మంత్రి ఆకుల వారితోట, అంకమ్మనగర్, కంకర గుంట ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున విశేష స్పందన కన్పించింది. 24వ డివిజన్ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ అడకా పద్మావతి, సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, నగర మహిళా విభాగం అధ్యక్షురాలు గనిక ఝాన్సీ, పార్టీ కన్వీనర్లు అడకా వేణు, కోలా సునీల్, షేక్ బాజీ, షేక్ సుభాని, ఖాసిం, మామిడి కిషోర్, అబ్రహం, నాగయ్య, శారదా లక్ష్మి, నాగూర్, 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ షేక్ సైదా, క్లస్టర్ ఇన్‌చార్జి వెంకట రెడ్డి, గుంటూరు జిల్లా గ్రీవెన్స్ సెల్ సింగ్ నర్సింహ, షబ్బీర్, మజీద్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం 23వ డివిజన్‌లో గడపగడపకూ ఎన్నికల ప్రచారం మూడు బొమ్మల సెంటర్ నుంచి ప్రారంభమైంది. కన్నావారితోట, నగరంపాలెం, గోరెళ్ల వారి దొడ్డి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం జరిగింది. స్థానిక పార్టీ నాయకులు బైరా అజయ్, తూమాటి మోజేష్, శ్రీకాంత్, ఫాజిల్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహంతో మరింత రాణింపు

ఏఎన్‌యూ ప్రొఫెసర్ పూర్ణచంద్రరావు


విద్యార్థులతో పూర్ణచంద్రరావు, ఎస్వీ రమణ, లలిత, తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా మరింతగా రాణిస్తారని ఏఎన్‌యూ టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ పి. పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను బహూకరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి, మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ పరీక్షలకు హాజరైన విద్యార్థులందరు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. వారిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ టీడీ విమల తన భర్త డాక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి పేరుతో స్మారక నగదు బహుమతులను అందజేశారని తెలిపారు. ఎంబీఏ విభాగంలో మువ్వల అనూష ప్రథమ బహుమతి, బడుగు నవ్యశ్రీ, గొరిగో దేవిక ద్వితీయ, తాటిపాకల మానసశ్రీ తృతీయ బహుమతి పొందారని వివరించారు. ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో గుంటి స్మైలీ ప్రథమ బహుమతితో పాటు ముదమాల నవ్యశ్రీ, జరపాల శిరీష బాయ్ ద్వితీయ, గంగుల లీలా వెంకట్ తృతీయ బహుమతి అందుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, అసోసియేట్ ప్రొఫెసర్లు డి. కళ్యాణి, ఎస్. గోపి శ్రీనివాసరావు, సీహెచ్ వైష్ణవి, ఏ.బాజీబాబు, సీహెచ్ వేదవతి, మణికంఠ, బి. అనిత, అభిలాష్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణతో సృజనాత్మక నైపుణ్యాలకు పదును

గుంటూరు ఎడ్యుకేషన్: బాలల్లో దాగిన సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదం చేస్తాయని హైదరాబాద్‌కు చెందిన లిటిల్ ఎడ్యు ఎంటర్‌ప్రైజెస్ సీఈఓ రమణకుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేట ఆరోలైనులోని హిందూ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం లిటిష్ ఎడ్యు సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా రమణకుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా లిటిష్ సంస్థ చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకత నైపుణ్యాలను వెలికితీసేందుకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న విధంగా నగరంలోని చిన్నారుల కోసం హిందూ పబ్లిక్ స్కూల్లో శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హిందూ ప్రాథమికోన్నత పాఠశాల కార్యదర్శి రామకృష్ణ పరమహంస మాట్లాడుతూ చిన్నారుల్లో ఆహ్లాదాన్ని పంచేందుకు డ్యాన్స్, ఏరోబిక్స్, వేద గణితం, చిత్రకళతో పాటు చిన్నారులను తీర్చిదిద్దేందుకు శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు.

మైనారిటీ సబ్ కోటా రద్దుపై మాట్లాడటం సిగ్గు చేటు

లక్ష్మీపురం: జాతీయస్థాయిలో ఓబీసీ రిజర్వేషన్లలో మైనారిటీ సబ్ కోటా రద్దుపై నోరు ఎత్తని రాజకీయ పార్టీలు ఈరోజు దాదాపు 12 సంవత్సరాల తర్వాత ఎన్నికల సమయంలో మాట్లాడటం సిగ్గు చేటు అని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ కలీం పేర్కొన్నారు. స్థానిక తూర్పు నియోజక వర్గ పరిధిలోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 4శాతం రిజర్వేషన్లు కల్పించడంపై దాదాపు రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలు స్వాగతిస్తూ ప్రకటనలు ఇచ్చాయి. సఖ్యతగా ఉంటున్న బీసీ, ముస్లిం వర్గాల మధ్య రాజకీయ చిచ్చు కోసం ఇటువంటి ప్రయత్నాలు చేయటం తగదని చెప్పారు. 2012లో న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఆర్ కృష్ణయ్య ను 2014లో తెలంగాణ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటన చేసి ఎమ్మెల్యే గా పోటీ చేయించిన పార్టీ కు ఆ పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గుర్తుకు రాని జాతీయస్థాయిలో ఓ బి సి కోటాలో మైనారిటీ సబ్ కోటా రిజర్వేషన్ల రద్దు, ఇప్పుడు గుర్తుకు రావడం అందులోనూ ఎన్నికల సమయంలో గుర్తుకు రావటం కేవలం ఎన్నికల జిమ్మిక్కు అని స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు.

తృతీయ ఫ్రంట్ మేనిఫెస్టో ఆవిష్కరణ

నెహ్రూ నగర్: తృతీయ ఫ్రంట్ మేనిఫెస్టోను శుక్రవారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ ఓ సమావేశ మందిరంలో శాసనసభ, పార్లమెంట్ ఇండిపెండెంట్ అభ్యర్థుల కామన్ అజెండా మేనిఫెస్టో ఆవిష్కరించారు. లోక్ తాంత్రిక జనతాదళ్ గుంటూరు ఎంపీ అభ్యర్థి బూరుగ రత్నం మాట్లాడుతూ బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా మూడో ఫ్రంట్ ఐక్య భారతీయ పార్టీలు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న షేక్ సిలార్, డాక్టర్ తాత సేవ కుమార్, గుర్రం రామారావు, కొరివి రజినీకాంత్, కొండూరి నాగరాజు, జోసెఫ్ పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఎంపికయ్యారు. ఐటీఎం స్కిల్స్ అకాడమీ సంస్థ ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్ షిప్ మేనేజర్ ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు వివిధ కళాశాలల నుంచి 37 మంది రాత, మౌఖిక పరీక్ష నిర్వహించి 13 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కంపెనీ ప్రతినిధులు మరో 15 మందిని తదుపరి ప్రక్రియకు ఎంపిక చేశారు. హెచ్ఆర్ మేనేజర్లు షహీనా, కళావతి నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రక్రియను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు మూనిస్‌ఖాన్, కె.అపర్ణ పర్యవేక్షించారు.

ఉద్యోగాలకు 30 మంది ఎంపిక

అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన గ్లాండ్ ఫార్మా సంస్థ నిర్వహించిన పూల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో బీ ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. గ్లాండ్ ఫార్మా హెచ్ఆర్ జనరల్ మేనేజర్ కె. శాంతి కిరణ సారథ్యంలో ప్రొడక్షన్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఎస్యూరెన్స్ ట్రైనీ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నిర్వహించిన రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో పాల్గొన్న 90 మంది విద్యార్థుల్లో 30 మందిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ప్లేస్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, ఓఎస్డీ డాక్టర్ పి.సీతారామయ్య అభినందించారు.

వాహనాల తనిఖీలు

పట్నంబజారు: ఎన్నికల ప్రక్రియలో భాగంగా గుంటూరు జిల్లాలో రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. శుక్రవారం గుంటూరు బుడంపాడు బైపాస్, నల్లచెరువు, పొన్నూరు రోడ్డు ప్రాంతాల్లో ఆర్టీఓలు ఎం.గోపాల్, ప్రసాద్, ఎంవీఐలు రాఘవరావు, అనిల్‌కుమార్, మల్లేశ్వరి, సంధ్య, సౌజన్యలతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.